## క్లుప్తంగా

### రోడ్డు నిర్మాణాన్ని మరిచారే!



**నకరికల్లు:** స్థానిక పాతూరు, శివాపురంతండా, ఉదయ్‌నగర్‌లకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. చినుకుపడితే తిప్పలే. నాటి టీడీపీ హయాంలో, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినా నిర్మాణ పనులు మాత్రం ముందుకు పడటం లేదు. నకరికల్లు ప్రధాన సెంటర్ నుంచి పాతూరు, శివాపురంతండా, ఉదయ్‌నగర్‌కాలనీలకు నిత్యం రాకపోకలు సాగించే రహదారి కావడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. నాటి స్పీకర్ కోడెల శివప్రసాద్ శంకుస్థాపన చేసినా పనులు ఆదిలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం మళ్లీ అదే టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. రహదారులను తీర్చిదిద్దుతామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ రోడ్డే తార్కాణంగా నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిని నిర్మించాలని మూడుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### కబడ్డీ పోటీలకు క్రోసూరు క్రీడాకారుడు



శివగోపీకృష్ణ

**క్రోసూరు:** సత్తెనపల్లిలోని అమరావతి హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అండర్ 20 విభాగం కబడ్డీ పోటీల్లో క్రోసూరు మోడల్ స్కూల్ క్రీడాకారుడు ఎస్.శివగోపీకృష్ణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ కం కాలేజీ ప్రిన్సిపాల్ మేరీ సూజన్ సోమవారం తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు, క్రీడా ఉపాధ్యాయుడు సీహెచ్ నరసింహారావు తదితరులు అభినందించారు.

### 22న హైదరాబాద్‌లో వర్గీకరణ సభ



**శావల్యాపురం:** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి కోసం ఈనెల 22న చేపట్టిన కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం శావల్యాపురంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి నూతన అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారత దేశంలో తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. హైదరాబాదు నగరంలో రవీంద్ర భారతిలో జరగనున్న ఈ సదస్సులో అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షులుగా కలుపుకూరి ప్రవీణ్ కుమార్ మాదిగను ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు కలుపుకూరి ఏసురత్నం మాదిగ, గోళ్ళ సుధాకర్ మాదిగ పాల్గొన్నారు.

### కళాఉత్సవ్‌లో జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**వినుకొండ:** పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ బోయపాలెంలో నిర్వహించిన కళా ఉత్సవ్–2025 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల హెచ్‌ఎం బి. శైలజ తెలిపారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఆమె మాట్లాడుతూ నాటక విభాగంలో గిడుగు ఏకపాత్రాభినయం ప్రదర్శించిన 10వ తరగతి విద్యార్థినీ శ్రీలక్ష్మికి ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో 3వ బహుమతి లభించిందని, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, జానపద నృత్యంలో విద్యార్థులు పాల్గొని ప్రశంసలు పొందారన్నారు. విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయినిగా డాక్టర్ వి.పద్మ వ్యవహరించారు.

### దేవాలయాల పునర్నిర్మాణానికి నిధులు

**బొల్లాపల్లి:** మండలంలోని వెల్లటూరు గ్రామంలో శ్రీ సోమేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాల కామన్ గుడ్ ఫండ్ లో నిధులు మంజూరయ్యాయని ఇన్చార్జి దేవదాయ శాఖ అధికారి సి.హెచ్.శివ నాగిరెడ్డి సోమవారం తెలిపారు. సోమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ 2.35 కోట్లు, వేణుగోపాలస్వామి ఆలయ పునర్మాణానికి కోటి రూపాయలు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని ఈవో చెప్పారు. గ్రామస్తుల సహకారంతో ఆయా దేవాలయాల పునర్మాణానికి సోమేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి లకు సంబంధించి రూ 66.66 లక్షలు,రూ 30 లక్షలు చెల్లించాల్సి ఉందని త్వరలో ఆలయాల పునర్నిర్మాణం చేపడతామని ఈవో తెలియజేశారు.

# సాంకేతిక పురోగతితో దేశాభివృద్ధి



ఈఈ మురళీధరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘ నేతలు



ఏఈ అనూషను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

### ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

**సత్తెనపల్లి:** సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు బండ్లమూడి వీరాంజనేయులు అన్నారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిలో భాగంగా ఏటా ఇంజినీర్స్ డే రోజున ఉత్తమసేవలు అందిస్తున్న కొంత మంది ఇంజినీర్లను గుర్తించి సత్కరిస్తున్నామన్నారు. దానిలో భాగంగా నీటిపారుదల శాఖ ఈఈ మురళీధరరావు, ఏఈ అనూష, ఏఈ సుందరరావు, పంచాయతీరాజ్ డీఈ శేఖర్ బాబు, ఎలక్ట్రికల్ ఏఈ పి.తిరుపతయ్య, మున్సిపల్ ప్లానర్ తోట చిన్న సాంబశివయ్యను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బండ్లమూడి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా ఇంజినీర్లను తయారు చేస్తున్న దేశాల్లో భారతదేశం ఒకటని వెల్లడించారు. మోక్షగుండంను ఆదర్శంగా తీసుకొని ఇంజినీర్లంతా దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కేఎల్ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు కంభాల వెంకటేశ్వరరావు, తవిటి భావనారాయణ, పెద్దింటి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసిన డాక్టర్ గజ్జల

**ఇంజినీర్లకు స్ఫూర్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య....**

సత్తెనపల్లి నాగార్జునసాగర్ కెనాల్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.మురళీధర్‌కు పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి కంబాల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గొప్ప ఇంజినీర్ విశ్వేశ్వరయ్య అని కొనియాడారు.

**విశ్వేశ్వరయ్యకు నివాళులు అర్పించిన డాక్టర్ గజ్జల**

**నరసరావుపేట:** భారతరత్న రాజనీతిజ్ఞుడు, ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ఘనంగా నిర్వహించారు.

సోమవారం నరసరావుపేటలోని సత్తెనపల్లి కార్యాలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను ఈసందర్భంగా కొనియాడారు.

# అన్ని రంగాల్లో రాణించాలి

**సత్తెనపల్లి:** చిన్నతనం నుంచే చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించి ప్రయోజకులు కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిన్నారులు సౌత్ ఇండియా కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్, కాంస్య పతకాలు సాధించిన విజేతలకు పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన అభినందన సభలో సోమవారం సత్కరించి, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. సభకు న్యాయవాది పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ కరాటేలో సత్తెనపల్లికి చెందిన లగుమవరపు కిరీటి, లగుమవరపు గేశ్ను ఆశిత్, మల్లాల వెంకట బాలాజీ, బొల్లేపల్లి టిషన్త్, బూతుకూరి అక్షయ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించగా బిట్రా సత్యనారాయణ కాంస్య పతకాలు సాధించి సత్తెనపల్లికే వన్నె తెచ్చారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చి విజేతలుగా నిలిపిన బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డౌన్ అనుముల రామయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య రచించిన సన్మాన పత్రాన్ని రామయ్యకు సమ ర్పించారు. ఈ సభలో రామయ్య గురువు, ఆయన సోదరుడు సీనియర్ కరాటే మాస్టర్ రాంబాబును సన్మానించారు.



సత్కారం అందుకున్న కరాటే విజేతలు, గురువు రామయ్య

**దేశవ్యాప్తంగా ఇనుమడింపజేశారు**

ఇంటర్నేషనల్ పవర్ లిఫ్ట్ గోల్డ్ మెడలిస్ట్ పసుపులేటి సురేష్, చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీర బ్రహ్మం, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్య ప్రకాశరావు, నరసరావుపేట పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో సత్తెనపల్లి ప్రతిష్టను దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత వీరికి దక్కిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల, ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని, తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు 'గాలికుంటు' టీకాలు



గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశువైద్యుడు బషీర్

**88త్యాళ్లూరు(క్రోసూరు):** మండలంలోని 88త్యాళ్లూరులో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరిగింది. 250 పశువులకు( 46 తెల్లపశువులు, 204 గేదెలు) టీకాలు వేసినట్లు మండల పశువైద్యుడు బషీర్ తెలిపారు. కార్యక్రమాన్ని సర్పంచ్ కె.ఏసమ్మ ప్రారంభించారు. పశువైద్యులు మాట్లాడుతూ పాలదిగుబడిని గణనీయంగా తగ్గించి పాడి రైతులకు నష్టం కలిగించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది, పాడి పోషకులు పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ జూడో జట్ల ఎంపిక

**చిలకలూరిపేట:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జూడో, గట్కా జిల్లా జట్ల ఎంపిక స్థానిక ఏఎంజీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా జట్లను ఎంపిక చేశారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి 260 మంది విద్యార్థులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. జూడో జట్ల ఎంపిక విద్యార్థుల బరువును బట్టి నిర్వహించగా, గట్కా జట్ల ఎంపిక వారి వయసుల ఆధారంగా నిర్వహించటం జరిగింది. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ పి నరసింహారావు, ఎన్ సురేష్‌కుమార్, డాక్టర్ వి పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు

### బ్లాక్‌ప్రైమరీ హెల్త్ యూనిట్ ప్రారంభం



**ముప్పాళ్ళ:** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించిన బ్లాక్ ప్రైమరీ హెల్త్ యూనిట్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రమాదేవి, జయకృష్ణప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చాగంటివారిపాలెంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది.

# కళాకారుడు రవికుమార్‌కు జాతీయ పురస్కారాలు

**సత్తెనపల్లి:** హైదరాబాద్ శారద మ్యూజిక్ అకాడమీ ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ బ్యాచ్ ఆధ్వర్యాన ఈ నెల 13న జరిగిన తెలుగు కీర్తి కిరీటాలు–2025 అంతర్ పురస్కారాల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు విశిష్ట జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రవికుమార్ పౌరాణిక కళా రంగంలో పదేళ్లుగా వివిధ విభిన్న, వైవిధ్య, పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు చేసినందుకు తెలుగు కీర్తి కిరీటాలు పౌరాణిక నట చక్రవర్తి పురస్కారం ప్రదానం చేశారు. రవికుమార్‌కు శాలువా కప్పి ప్రశంసాపత్రంతో పురస్కారం ప్రదానం చేసి ప్రత్యేకంగా అభినందించారు. విశ్వకర్మ హుస్నాబాద్ సిద్దిపేట వారి విశ్వకళాభూషణ్ జాతీయ గౌరవ పురస్కారాన్ని ఈనెల 14న అందించారు. రవికుమార్‌ను సత్తెనపల్లిలోని ప్రముఖులు సోమవారం అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న రవికుమార్

### క్రీడలు మానసిక దృఢత్వాన్ని కలగజేస్తాయి

**మాచర్ల రూరల్:** క్రీడలు విద్యార్థులకు మానసిక దృఢత్వంతో పాటు, స్నేహపూరిత వాతావరణాన్ని కలగజేస్తాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అండర్- 19 ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతకు బహుమతి ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో నాలుగు జిల్లాలకు సంబంధించి క్రికెట్ పోటీలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయం అన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.25 వేలు వినుకొండ కృష్ణవేణి జూనియర్ కాలేజీ, రెండో బహుమతి రూ.20 వేలు సోషల్ వెల్ఫేర్ స్కూల్ అచ్చంపేట, మూడో బహుమతి 15 వేలు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ(విజయపురిసౌత్)లకు చెందిన విద్యార్థులు సొంతం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నశ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు.

# పత్తి రైతుల ఆశలపై నీళ్లు



పూత పిందె దశలో పత్తిపైరు



రాలిపోయిన పత్తి పూత, పిందె

**అమరావతి:** ఖరీఫ్ సీజన్‌లో పత్తికి వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ఎంతో ఉత్సాహంగా సాగుచేశారు. గత నెలరోజుల్లో తుఫాన్‌లు, వరదలు రావడం రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. పత్తి విత్తే సమయంలో వాతావరణం అనుకూలంగా ఉన్నా పూత, పిందె, గూడదశలో వర్షాలు కురియడంతో ఎదుగుదల నిలిచి దిగుబడులు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

మూడు రోజులుగా వాన తెరపివ్వడంతో అంతర సాగు చేసుకుంటున్న రైతులు కొమ్మలకు ఉన్న గూడలు, పిందె రాలి పోవడంతో దిగుబడులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తి చేతి కందే వరకు నమ్మకం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల వ్యవసాయాధికారి అహ్మద్ మాట్లాడుతూ మండలంలోని ప్రస్తుతం పరిస్థితుల్లో పత్తి మొక్కలు భూమి నుంచి పోషక పదార్థాలను అందుకోలేవని తెలిపారు.

### ఏజీకేఎం వాకర్స్,హెల్త్ క్లబ్ అధ్యక్షుడిగా కాపుగంటి



కాపుగంటి శ్రీవెంకటరత్నం



ఉడుముల వెంగళరెడ్డి

**సత్తెనపల్లి:** ఏజీకేఎం వాకర్స్, హెల్త్ క్లబ్ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడిగా కాపుగంటి శ్రీవెంకటరత్నం ఎన్నికయ్యారు. పట్టణంలోని అన్నం గురువమ్మ కృష్ణమూర్తి కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక జరిగింది. చైర్మన్‌గా పుట్టి సాంబశివరావు, డిస్ట్రిక్స్ గవర్నర్–2025గా పెద్ది శివరామ్‌ప్రసాద్, కార్యదర్శిగా ఉడుముల వెంగళరెడ్డి, కోశాధికారిగా జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు(మౌర్య), ఉపాధ్యక్షులుగాపోతుగంటి రామకోటేశ్వరరావు, రావెల చంద్రశేఖర్, గొర్రెపాటి సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా శిరసాల భుజంగరావు, తెంటు బాలాజీ, ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, పూర్వాధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

### సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ



వేల్పూరు రిటైల్ దుకాణాల్లో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ

**అచ్చంపేట:** యూరియాను అధిక ధరకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ డీలర్లను, ఎరువుల విక్రయ దుకాణాదారులను హెచ్చరించారు. మండలంలోని వేల్పూరులో సోమవారం ఆమె ఎరువులు, పురుగు మందు దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లు తప్పనిసరిగా ఉంచాలని, వివరాలను నోటీస్ బోర్డుపై ఉంచాలన్నారు. రైతులు అడిగిన మందులను మాత్రమే ఇవ్వాలని, వేరే మందు కొంటేనే అడిగిన ఎరువులు ఇస్తామని అన్నట్లు తమ నోటీసుకు వస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. యూరియా కొరత లేదని, అపోహలు నమ్మి రైతులు నిల్వ ఉంచుకోవద్దన్నారు. ఆమె వెంట ఏవో పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది ఎరువుల దుకాణాల డీలర్లు, రైతులు ఉన్నారు.

# 'ఉపాధి' లక్ష్యాలను చేరుకోవాలి

### డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి



బెల్లంకొండలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

**బెల్లంకొండ:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను మండలంలో నూరు శాతం చేరుకోవాలని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో అందరికీ వందరోజుల ఉపాధి పని కల్పించాలన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి తొట్టెల నిర్మాణాలపై గ్రామాల వారీగా చర్చించారు. పండ్ల తోటల పెంపకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై అందిన ఫిర్యాదులపై విచారణ చేశారు. గ్రామానికి సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు రిజర్వేషన్ ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీ నారాయణ, ఎంపీడీవో పి.సునీత, సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, నేతలు గుంజ గంగారావు, కొడవటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

**అమరావతి:** ధరణికోట జైల్ సింగ్ కాలనీలో రెవిన్యూ శాఖ, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంపిణీలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేల్, పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అచ్చంపేట:** ఇకపై చౌకధరల దుకాణాల్లో స్మార్ట్ కార్డులతో బియ్యం సరఫరా అవుతుందని తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. పల్నాడు కలెక్టరు ఆదేశాల మేరకు సోమవారం ఆయన రేషన్ షాపుల్లో కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు జానీ బాషా, వినియోగదారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి:** పట్టణంలోని 10వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని 31 వార్డులకు 15 సచివాలయాల ద్వారా 15,745 స్మార్ట్ రేషన్ కార్డులు రాగా 10వ వార్డులో ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు స్మార్ట్ అందించారు. మండలంలోని 19 సచివాలయాల ద్వారా 24,269 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. ఎరువులు దక్కించుకోవడానికి రైతన్న పాట్లు పడుతున్నాడు. ఎన్నిఅవస్థలు పడినా యూరియా దక్కించుకోలేక అన్నదాతలు తిప్పలు పడుతున్నారు. సోమవారం నకరికల్లు, గుండ్లపల్లి, నర్సింగపాడు, త్రిపురాపురం, చల్లగుండ్ల, చీమలమర్రి గ్రామాల నుంచి మన గ్రోమోర్ కేంద్రానికి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. ముందుగా స్లిప్పులు రాసే పద్ధతి కావడంతో పెద్దఎత్తున హడావుడి పడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా కేవలం 100 నుంచి 125 మంది రైతులకే యూరియా అందింది. దీంతో సాయంత్రం 4గంటల వరకు ఎదురుచూసిన రైతులు నిరాశతో తిరుగుముఖం పట్టాల్సివచ్చింది.

–నకరికల్లు

# 18న సీఐటీయూ మహాసభలు



మాట్లాడుతున్న సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుజాత

**సత్తెనపల్లి:** అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా మహాసభలు ఈ నెల 18న సత్తెనపల్లిలో జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుజాత పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుజాత మాట్లాడుతూ ఐసీడీఎస్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తై స్వర్ణోత్సవాలు జరుపుకొంటున్న తరుణంలోనూ ఆ రంగంలో పనిచేస్తోన్న అంగన్‌వాడీలు, హెల్పర్లు ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 18న జరిగే మహాసభలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ కార్యదర్శి అహల్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి హరిపోతురాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు పెండ్యాల మహేష్, సెక్టార్ లీడర్లు జ్యోతి, అంజలి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పోటీ పరీక్షలు

**బొల్లాపల్లి:** జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వారధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్ష సోమవారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, కేజీబీవీలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలో 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 30 మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వ్యాసరచనకు సంబంధించి విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత, డిబేట్‌కు సంబంధించి శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంలో దేనికి ప్రాధాన్యత పై పోటీ పరీక్షలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి-2 వివరించారు. మండల స్థాయి పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో జడ్పీ హైస్కూల్ బండ్లమోటుకు చెందిన 8,9,10, తరగతుల విద్యార్థులు వ్యాసరచనలో సువర్ణ జ్యోతి, దేవేంద్ర నాయక్, శ్రీనివాసరావు లు, డిబేట్ లో కేజీబీవీ కి చెందిన డి.చంద్రకళ, బి.తులసి భార్గవి బాయి, వి.ప్రమీల బాయిలు ప్రథమ స్థానంలో గెలుపొందినట్లు విద్యాశాఖ అధికారి-2 తెలిపారు.